

కళా నీరాజనం!
ప్రముఖ టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్లకు మంగళవారం ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. - 8లో



గొడవ.. గ్యాంగ్‌వార్
ఇద్దరు విద్యార్థుల మధ్య తలెత్తిన చిన్న గొడవ గ్యాంగ్ వార్‌కు దారి తీసిన ఘటన పలమనేరులో జరిగింది. - 8లో



షెడ్యూల్ పత్రాలు లాక్కెళ్లారు!
బోయకొండలో ఓ టెండర్ దారుడి నుంచి కూటమి నేతలు షెడ్యూల్‌పత్రాలు లాక్కెళ్లిన ఘటన మంగళవారం జరిగింది. - 8లో



న్యూస్‌రీల్

ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్రంలోని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారు. ఈ ప్రవేశ పరీక్షకు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.విశ్వనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏప్రిల్ 30న నిర్వహించే పాలిసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులు అరికట్టండి

- రాష్ట్ర మలేరియా అడిషనల్ డైరెక్టర్ రామనాథరావు



మాట్లాడుతున్న రాష్ట్ర మలేరియా అడిషనల్ డైరెక్టర్ రామనాథరావు

చిత్తూరురూరల్ (కాణిపాకం): సీజనల్‌గా వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా వ్యవహరించి, కట్టడికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మలేరియా అడిషనల్ డైరెక్టర్ రామనాథరావు ఆదేశించారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఉన్న మలేరియా విభాగాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మలేరియా కీటక జనిత వ్యాధులపై సమీక్షించారు. దోమల నివారణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. మలేరియా, డెంగీ ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ఫాగింగ్ చేయించడంతో పాటు వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. ప్రజలకు సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, అధికారులు అనిల్‌కుమార్, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి ఏనుగు తమిళనాడుకు మళ్లింపు



ఏనుగు ఆనవాళ్లు కనిపెట్టుకుని వెళుతున్న అటవీశాఖ సిబ్బంది

గుడిపాల: అటవీశాఖ అధికారులు ఎట్టకేలకు ఒంటరి ఏనుగును తమిళనాడు వైపునకు మళ్లించారు. గుడిపాల మండలంలో పాగా వేసిన ఒంటరి ఏనుగు జాతీయ రహదారిపైకి రావడంతోపాటు అనుపు గ్రామంలోకి కూడా చొరబడింది. అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఆనందరెడ్డి, బీట్ ఆఫీసర్లు ఢిల్లీరాణి, ప్రభాకర్ రెడ్డి, బీట్ ఆఫీసర్లు జబిల్లా, అరుణతో పాటు సిబ్బంది ఒంటరి ఏనుగు వెళుతున్న వైపు వెళ్లి బాణసంచా కాల్చారు. దీంతో అనుపు గ్రామం, బొమ్మసముద్రం, కనకనేరి గ్రామాల చుట్టుపక్కన పొలాల వైపు వెళ్లిన ఏనుగును తమిళనాడు వైపునకు మళ్లించారు. ఏనుగు తిరిగి వస్తే తమకు సమాచారం అందించాలని అటవీశాఖ అధికారులు గ్రామస్తులకు సూచించారు.

ముగ్గురు విద్యార్థుల డిబార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో తొమ్మిదో రోజు నిర్వహించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన ముగ్గురు విద్యార్థులను డిబార్ చేసినట్లు ఇంటర్మీడియట్ డీవీఈఓ సయ్యద్ మౌలా తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని వి.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన ముగ్గురు విద్యార్థులు(ఇద్దరు జనరల్ విద్యార్థులు, ఒకరు ఒకేషనల్ విద్యార్థి)ను డిబార్ చేశామన్నారు. మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిస్తే సహించేది లేదని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 11వ తేదీ నిర్వహించిన ప్రథమ సంవత్సరం పరీక్షల్లో 17,180 మంది విద్యార్థులకుగాను 1,021 మంది గైర్హాజరుకాగా 16,156 మంది హాజరైనట్లు డీవీఈఓ వెల్లడించారు.

▸ 2014వ సంవత్సరం.. జాబు రావాలంటే బాబు రావాలి. అధికారంలోకి వస్తే ఇంటికొక ఉద్యోగం.. లేకపోతే ప్రతి నిరుద్యోగికి రూ.2 వేల నిరుద్యోగభృతి హామీ. తీరా అధికారంలోకి వచ్చాక హామీల ఊసే ఎత్తలేదు. 2019 సార్వత్రిక ఎన్నికలు సమయానికి అష్ట వంకరలు పెట్టి అరకొర సంఖ్యలో లబ్ధిదారులను అదీ జన్మభూమి కమిటీలు చెప్పిన వారినే ఎంపిక చేసి, మమ అనిపించారు.

▸ 2024 సంవత్సరం.. అధికారమే పరమావధిగా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అండ్‌కో సూపర్‌సిక్స్ మోత మోగించింది. అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల, ఏటా 4 లక్షల ఉద్యోగాలు, లేదా రూ.3 వేల నిరుద్యోగభృతి హామీల వర్షం కురిపించారు. అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తి అవుతున్నా ఆ ఊసేలేదు. ఉన్న ఉద్యోగాలు ఊడుతున్నాయి.

బాబు వచ్చే.. జాబు రాదే?

'చంద్రబాబుకు ముని శాపం ఉంది. నిజం చెబితే తల వేయి ముక్కలవుతుంది. అందుకే ఆయన నిజం చెప్పరు. చెప్పింది చేయరు' అని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అసెంబ్లీ సాక్షిగా అన్న మాటలు అక్షరసత్యమని పదేపదే రుజువు చేస్తున్నారు. ఎన్నికల ముందు అంతన్నారు..ఇంతన్నారు.. అధికారంలోకి రావడమే ఆలస్యమన్నారు.. జాబు కావాలంటే బాబు రావాలన్నారు.. అధికారంలోకి వచ్చి పది నెలలవుతున్నా నిరుద్యోగులకు జాబు మాత్రం రాకపోయే అని నిరుద్యోగ యువత నిట్టూర్పుతోంది.

- ఏడాదికి 4 లక్షల ఉద్యోగాల ఆశలు ఆవిరి
- ఊసేలేని నిరుద్యోగ భృతి
- ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరుతో విద్యార్థులకు టోపీ
- అధికారం కోసం బాబు, పవన్ బూటకపు హామీలు
- నిరుద్యోగులు, ఉన్నత విద్యార్థుల పక్షాన వైఎస్సార్ సీపీ
- నేడు కలెక్టరేట్ ఎదుట 'యువతపోరు'



ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ వివరాలు ఇలా...

నియోజకవర్గం	విద్యార్థులు	పెండింగ్ మొత్తం (రూ. కోట్లల్లో)
చిత్తూరు	2,517	4,82,02,359
నగరి	3,444	6,20,96,235
పుంగనూరు	4,694	8,76,63,867
పూతలపట్టు	3,006	6,28,15,905
పలమనేరు	4,252	6,99,16,920
కుప్పం	3,049	5,04,42,063
గంగాధరనెల్లూరు	3,187	6,64,84,512
మొత్తం	24,149	44,76,21,861

చిత్తూరు కలెక్టరేట్ : అలవికానీ హామీలు ఇవ్వడం.. ఆ తరువాత మాట తప్పడం చంద్రబాబుకు అలవాటుగా మారింది. అధికారంలోకి వస్తే ఇంటింటికీ ఉద్యోగం, లేదా నిరుద్యోగ భృతి ఇస్తామంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టిన ఆయన సీఎం అయ్యాక మొహం చాటేశారు. కూటమి సర్కారు కొలువుదీరినప్పటి నుంచి ఒక ఉద్యోగం కానీ.. రూపాయి నిరుద్యోగ భృతి కానీ ఇచ్చివుంటే ఒట్టు. దీంతో నిరుద్యోగుల పరిస్థితి దయనీయంగా మారింది. చిత్తూరు జిల్లాలోని డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు, ఐటీఐ, నర్సింగ్, పాలిటెక్నిక్, మెడకల్, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో 64,789 మంది విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసిస్తున్నారు. వీరితోపాటు ఇప్పటికే డిగ్రీలు పుచ్చుకుని డీఎస్సీ, గ్రూపు పరీక్షలు, పోలీస్ రిక్రూట్‌మెంట్, ఏపీపీఎస్సీ తదితర కొలువుల కోసం సుమారు 45 మంది ప్రయత్నాలు చేస్తున్నారు. తమ బిడ్డల భవిష్యత్తు కోసం వారి తల్లిదండ్రులు అయినకాడికి అప్పులు చేసి కోచింగ్ సెంటర్లలో శిక్షణ ఇప్పిస్తూ ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నారు.

4 లక్షలు కాదు కదా.. 4 పదుల ఉద్యోగాల్లేవ్!

జిల్లాలోని యువత చంద్రబాబు అండ్ కో చేతిలో మరోసారి మోసపోయింది. ఏడాదికి 4 లక్షలు కాదు కదా కొత్తగా 4 పదుల సంఖ్యలోనైనా ఉద్యోగాల భర్తీని కూటమి టీడీపీ చేపట్టలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పించిన ఉద్యోగాలను సైతం ఊడగొడుతున్నారు. సచివాలయ ఉద్యోగులను అనిశ్చితి పరిస్థితుల్లోకి నెట్టేశారు. మెగా డీఎస్సీ దగా చేసేశారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ బాట పట్టిస్తున్నారు. రూ.5 వేలు కాదు కదా రూ.10 వేలు ఇస్తామని వలంటీర్లలో ఆశలు కల్పించి తీరా అధికారంలోకి వచ్చాక వారి ఉద్యోగాలు తొలగించి, కడుపులు కొట్టారు. ఇక నిరుద్యోగ భృతి హామీ కూడా టీడీపీ 2014-19 పాలన మాదిరిగానే ప్రస్తుతం ఎగనామం పెట్టేశారు. చిత్తూరు జిల్లాలో దాదాపు 4 లక్షల మంది నిరుద్యోగ యువతకు మొండి చేయి చూపారు.

కళాశాల విద్యార్థులకు మొండిచేయి..

మరోవైపు ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులకూ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా మోసం చేశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో జిల్లాలోని 64,789 మంది ఉన్నత విద్య చదివే విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ వర్తించేది. గత వైఎస్సార్‌సీపీ పాలనలో నిరాటంకంగా అమలు చేసిన జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన పథకాలను టీడీపీ కూటమి అటకెక్కించారు. ఫలితంగా జిల్లాలో వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కావాల్సిన దుస్థితి ఏర్పడింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో భరోసా

గత వైఎస్సార్‌సీపీ నిరుద్యోగులు, విద్యార్థులకు అండగా నిలిచింది. అమ్మఒడి పథకం ద్వారా ఐదేళ్లలో జిల్లాలోని 2,49,348 మంది తల్లుల ఖాతాలకు రూ.1458.9 కోట్లు జమ చేశారు. జిల్లాలోని 1,89,789 మంది విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన పథకం కింద రూ.879.33 కోట్లు, వసతి దీవెన పథకం కింద 1,78,148 మందికి రూ.245.36 కోట్లు సాయం అందించింది. నిర్ణీత సమయంలో ప్రభుత్వం ఫీజులు అందించడంతో తల్లిదండ్రులు నిశ్చింతగా ఉండేవారు.

నేడు వైఎస్సార్‌సీపీ 'యువత పోరు'

యువత, విద్యార్థులను కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ఎండగడుతూ వారి పక్షాన బుధవారం 'యువతపోరు' నిర్వహించేందుకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యువత, విద్యార్థులతో కలిసి కలెక్టరేట్‌కు పార్టీ శ్రేణులు భారీ ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నారు.

జిల్లాలోని కళాశాలల సమాచారం

డిగ్రీ కళాశాలలు :	116
ఇంజినీరింగ్ కళాశాలలు:	14
ఐటీఐ కళాశాలలు:	18
నర్సింగ్ కళాశాలలు:	7
పాలిటెక్నిక్ కళాశాలలు:	8
మెడికల్:	2
బీఈడీ కళాశాలలు:	7
ఎంబీఏ, ఎంసీఏ:	11
మొత్తం కళాశాలలు :	183

ఎలా చదువుకోవాలి



పది నెలలు పూర్తవుతున్నా ప్రభుత్వం ఇంత వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఇవ్వకపోతే మేము ఉన్నత విద్య ఎలా చదువుకోవాలి. కళాశాలకు వెళితే ఫీజుల పేరుతో వేధిస్తారు. కూలీ పనులు చేసుకునే తల్లిదండ్రులు ఒక్కసారిగా రూ.వేలల్లో ఫీజులు చెల్లించాలంటే ఎలా సాధ్యపడుతుంది. ఉన్నత విద్య చదువుకునే మాపై కూటమి టీడీపీ కక్ష సాధింపులకు పాల్పడుతోంది.
-తోటి ఆనందరావు, శ్రీరంగరాజపురం మండలం

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



కూటమి టీడీపీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. నేను సివిల్ ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం చదువుకుంటున్నాను. గత ఐదేళ్లల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో ఎలాంటి సమస్యలుండేవి కావు. ఈ ప్రభుత్వం వచ్చాక ఇంత వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రస్తావనే లేదు. ఫీజులు చెల్లించలేక అవస్థలు పడుతున్నాం. పేద విద్యార్థులపై చిన్నచూపు సబబు కాదు.
- భానుప్రకాష్, విద్యార్థి, బంగారుపాళెం మండలం

జాబ్ క్యాలెండర్ ఊసే లేదు



జనవరిలోనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఆర్భాటంగా ప్రకటించారు. అయితే ఇప్పటివరకూ జాబ్ క్యాలెండర్ ఊసే ఎత్తడం లేదు. నిరుద్యోగ భృతి మాట సైతం మరిచిపోయారు. నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం మోసం చేసింది. ఎమ్మెస్సీ వరకు చదువుకున్నాను. ఉద్యోగం రాకపోవడంతో స్వగ్రామంలో వ్యవసాయం చేసుకుంటున్నాను.
- రమేష్, వి.కోట మండలం

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు ?



సూపర్ సిక్స్‌లో భాగంగా నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామన్నారు. బీటెక్ వరకు చదుకున్నాను. ఉద్యోగాల నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తూనే ఉన్నాను. నిరుద్యోగ భృతి పథకాన్ని ఇప్పటివరకూ అమలు చేయలేదు. ఉద్యోగం లేక ఇబ్బందులు పడుతున్నాం. కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి అందించి నిరుద్యోగులను ఆదుకోవాలి.
- ప్రవీణ్, నిరుద్యోగి, చిత్తూరు

యువతకు మోసం



చంద్రబాబు 2014 ఎన్నికల్లోనూ నిరుద్యోగ భృతి అంటూ మోసం చేశారు. మళ్లీ గత ఎన్నికల్లోనూ ఈ హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారం చేపట్టి తొమ్మిది నెలలు గడిచినా ఇప్పటివరకూ నిరుద్యోగ భృతి ప్రస్తావన లేదు. ఇలా మోసపూరిత వాగ్దానాలతో ప్రతి సారీ యువతను మోసం చేయడం సమంజసం కాదు.
- సద్దాం, విద్యార్థి సంఘ నాయకుడు, చిత్తూరు

ఉద్యోగాలేవి సారూ..



ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలు స్థాపించి 5 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. విదేశాల నుంచి పెట్టుబడులు తీసుకొస్తామన్నారు. ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారు చేస్తామన్నారు. ఇప్పుడేమో సర్వేల పేరుతో కాలయాపన చేస్తున్నారు. అధికారంలోకి వచ్చి పది నెలలవుతోంది.. ఏ వర్గానికి ఎలాంటి మేలు చేయలేదు. నేను బీఎస్సీ కంప్యూటర్స్ చదివా. ఎలాంటి నోటిఫికేషన్ లేక ఖాళీగా ఉన్నా.
- కిషోర్, నిరుద్యోగి, నగరి మండలం

పేదలకు మరింత భారం



ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో తల్లిదండ్రులపై భారం పడుతోంది. గత ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో వచ్చేది. ఎలాంటి సమస్యలు లేవు. పేదలు ఒక్కసారిగా డబ్బులు కట్టాలంటే కష్టమే. ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఫీజు మొత్తం ఒక్కసారి కట్టలేక విద్యార్థులంతా ఆందోళనకు లోనవుతున్నారు. ఫీజుల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరం.
- ముస్తా, విద్యార్థి, కార్వేటినగరం

నేటి యువతపోరుకు తరలిరండి



చిత్తూరు కార్పొరేషన్: యువత సమస్యలపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్న యువతపోరు కార్యక్రమానికి యువత తరలిరావాలని ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి పిలుపునిచ్చారు. యువతపోరు కార్యక్రమంపై మంగళవారం నియోజకవర్గ నాయకులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఉదయం 9 గంటలకు జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించనున్నామన్నారు. అనంతరం అమూల్ డెయిరీ వద్దకు చేరుకుంటామన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎంపీ రెడ్డెప్ప, జిల్లాలోని నియోజకవర్గాల సమన్వయకర్తలతో కలిసి ర్యాలీగా వేలాది మందితో కలెక్టరేట్ వద్దకు నినాదాలు చేసుకుంటూ వెళతామన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగభృతి ఇవ్వాలని, మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేయడం ఉపసంహరించుకోవాలని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అమూల్ డెయిరీ వద్దకు 9.30 గంటలకు చేరుకోవాలన్నారు. అందరూ పాల్గొన్ని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నిరుద్యోగులను కూటమి దగా చేస్తోంది



వెదురుకుప్పం: కూటమి ప్రభుత్వంలో నిరుద్యోగులు, యువత దగా పడుతున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి వ్యాఖ్యానించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పేద పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించాలన్న ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. నేడు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో పేదలకు ఉన్నతవిద్య అందని ద్రాక్షగా మిగిలిపోయిందని ఆరోపించారు. విద్యతోనే పేదల తలరాతలు మారుతాయని విశ్వసించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీషు మీడియం బోధన, ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేశారని కొనియాడారు. అయితే ప్రస్తుతం చంద్రబాబు పేద పిల్లలకు ఇంగ్లీషు మీడియంబోధనను రద్దు చేసే దిశగా అడుగులు వేస్తూ సర్కారు చదువులను నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తామంటూ ఊదరగొట్టిన కూటమి నేతలు పది నెలల్లో ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. యువతకు ఉపాధి కల్పనలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కూటమి నిర్లక్ష్యంపై వైఎస్సార్ సీపీ బుధవారం యువత పోరు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత ఈ కార్యక్రమానికి తరలివచ్చి, జయప్రదం చేయాలని కోరారు.

ఆకస్మిక తనిఖీలు చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మండల ప్రత్యేకాధికారులు ఆకస్మిక తనిఖీలు చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో వరుస సమీక్షలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతిగృహాలు, సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేయాలన్నారు. ప్రభుత్వ సేవలను పారదర్శకంగా ప్రజలకు అందే దిశగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించాలన్నారు.

అభ్యసనా సామర్థ్యాలు పెంచాలి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఐదో తరగతి విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంచేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరం ఐదు నుంచి ఆరో తరగతికి వెళ్లే విద్యార్థులకు తెలుగు, గణితం, ఇంగ్లీషు, తదితర పాఠ్యాంశాలలో కనీస అభ్యసనా సామర్థ్యాలు ఉండేలా హెచ్ఎంలు, టీచర్లు కృషి చేయాలన్నారు.

ఎంపీ నిధుల పనులను త్వరితగతిన చేపట్టండి

ఎంపీ నిధులతో చేపడుతున్న పనులను త్వరితగతిన నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పురోగతిలో ఉన్న పనులు వేగవంతంగా చేపట్టి బిల్లులను సకాలంలో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశాల్లో సీపీఓ సాంబశివారెడ్డి, డ్వామా పీడీ రవికుమార్, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ, తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారుల నియామకం

చిత్తూరు కలెక్టరేట్ : జోనల్, జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఈ నెల 11న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వుల మేరకు జోనల్ పరిధి (ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య) జోనల్ ఇన్‌చార్జిగా ఐఏఎస్ ముప్వా తిరుమల కృష్ణను నియమించారు. అలాగే చిత్తూరు జిల్లా ప్రత్యేకాధికారిగా ఐఏఎస్ కేవీఎస్ చక్రధర్‌బాబును నియమించారు.

18న రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం

చిత్తూరు జిల్లాలో ఈ నెల 18వ తేదీన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు డీఆర్వో మోహన్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో ఈ నెల 18వ తేదీన 1950, 1951 చట్టంపై సమావేశం నిర్వహించనున్నామన్నారు. నిబంధనలకు అనుగుణంగా పరిష్కారం కాని సమస్యలు ఏవైనా గుర్తించినట్లైతే తగు సూచనలు చేయాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనాలని డీఆర్వో కోరారు.

లైంగిక వేధింపుల నివారణకు చర్యలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పిల్లలపై జరిగే లైంగిక వేధింపులపై చర్యలు తీసుకోవాలని డీఎం అండ్‌హెచ్‌ఓ సుధారాణి పేర్కొన్నారు. చిత్తూరులోని తన కార్యాలయంలో మంగళవారం పిల్లలపై లైంగిక వేధింపులపై వివిధ శాఖ అధికారులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పిల్లలపై లైంగిక దాడులు జరగకుండా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నా రు. పాఠశాలలో పిల్లలకు మంచి చెడులపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు గిరి, ప్రవీణ, దుర్గా ప్రసాద్ రావ్, స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఆధార్ నమోదు ప్రక్రియ



మాట్లాడుతున్న డీఆర్వో మోహన్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఆధార్ నమోదు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని డీఆర్వో మోహన్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆధార్ నమోదు ప్రక్రియను ఎటువంటి తప్పులు లేకుండా కచితత్వంతో చేయాలని సంబంధిత అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్ ఆదేశించారు. ప్రతి భారతీయ పౌరునికి ఆధార్ తప్పనిసరి అని చెప్పారు. ఆధార్‌తో చాలా అంశాలు ముడిపడి ఉన్నాయన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికకు ఆధార్ ప్రధానంగా ఉందన్నారు. ఆధార్ నమోదులో పొరపాట్లకు తావులేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. 2011 నుంచి ఆధార్ నమోదు నిరంతర ప్రక్రియగా కొనసాగుతోందన్నారు. జిల్లాలో మొత్తం 226 ఆధార్ నమోదు కేంద్రాలున్నాయని చెప్పారు. అందులో 117 గ్రామ, వార్డు సచివాలయాలు, 7 ఈ సేవా కేంద్రాలు, 9 పోస్ట్ ఆఫీసులు, 9 బీఎస్ఎన్ఎల్ ఆఫీసులు, 14 బ్యాంక్‌లు, 34 వైద్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయల్లో ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేషన్ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. బయోమెట్రిక్ అప్‌డేషన్ నిరంతర ప్రక్రియగా ఉందన్నారు. 5 నుంచి 7 ఏళ్ల మధ్య వయసులో ఒకసారి, 15 -17 సంవత్సరాల మధ్యలో మరోసారి ఆధార్ అప్‌డేషన్ తప్పనిసరి అన్నారు. గత 30 రోజుల నుంచి 60,519 మందికి ఆధార్ నమోదు, అప్‌డేషన్ ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో డీఎల్‌డీఓ రవికుమార్, ఎల్‌డీఎం హరీష్, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, పోస్టల్ సూపరింటెండెంట్ లక్ష్మణ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయాల్లో సస్యరక్షణ తప్పనిసరి



మాట్లాడుతున్న డీహెచ్‌ఓ దశరథరామిరెడ్డి

పుత్తూరు: మామిడి రైతులు నిర్ణీత సమయాల్లో తప్పనిసరిగా సస్యరక్షణ చేపట్టాలని జిల్లా ఉద్యానవన అధికారి దశరథరామిరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మార్కెట్‌యార్డ్‌లో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మామిడి రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యానవన శాఖ వారి ఆధ్వర్యంలో పండ్లకు చుట్టే కవర్లు 50 శాతం రాయితీతో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కవర్లు చుట్టడంతో కాయల నాణ్యత పెరుగుతుందన్నారు. కవర్లు కావల్సినవారు పట్టాపాస్ బుక్, ఆధార్, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు తీసుకువచ్చి రైతు సేవా కేంద్రాల వద్ద దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ రన్‌జిత్ మాట్లాడుతూ మామిడి సస్యరక్షణ, ఫల సంరక్షణ, మార్కెటింగ్ విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, డ్రిప్ పీడీ సతీష్, పుత్తూరు ఏడీఏ రమేష్‌రాజు, ఏఓ కోదండయ్య, హార్టికల్చర్ ఆఫీసర్ వెంకటసౌజన్య, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుప్పంలో ఉపాధి కల్పనకు కృషి


పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు

కుప్పం: నియోజకవర్గంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పనకు కృషి చేస్తున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. మంగళవారం కడా కార్యాలయ ప్రాంగణంలో 1ఎమ్, 1బి జాబ్ మేళాను నిర్వహించారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు వివిధ కంపెనీల్లో ఖాళీగా ఉన్న 700 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. భారీగా నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారని, ఎంపిక కాని వారికి కూడా త్వరలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో 1ఎమ్,1బి సభ్యులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ పి.ఎస్.మునిరత్నం, డా.సురేష్‌బాబు, టీటీడీ బోర్డు సభ్యులు శాంతారామ్, కుప్పం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌కు మూడేళ్ల జైలు


పోలీసుల అదుపులో నిందితుడు

చిత్తూరు అర్బన్: పోక్సో కేసులో నిందితుడైన ఆటోడ్రైవర్‌కు మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ మంగళవారం స్థానిక జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి శాంతి తీర్పు చెప్పారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోహనకుమారి కథనం మేరకు.. బంగారుపాళెం మండలం గుండ్లకట్టమంచికి చెందిన ధనరాజ్(45) చిత్తూరు, బంగారుపాళెం పరిసర ప్రాంతాల్లో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. చిత్తూరు నగరానికి చెందిన 17 ఏళ్ల బాలిక స్థానికంగా ఓ పార్కు వద్ద ఉండగా ఆటోడ్రైవర్ ధనరాజ్ 2020 అక్టోబర్ 15వ తేదీన బాలికతో అసభ్యకరంగా వ్యవహరించాడు. దీనిపై బాలిక కుటుంబ సభ్యులు స్థానిక వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. పూర్వాపరాలను పరిశీలించిన తరువాత నేరం రుజువుకావడంతో నిందితుడికి మూడేళ్ల మూడు నెలలు జైలుశిక్షతో పాటు రూ.2,500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఇంకెప్పుడు వస్తారు?

- 5 నెలలవుతున్నా విధుల్లో చేరని ఉద్యోగులు
- చిత్తూరు ఎస్‌ఈ కార్యాలయంపై అనాసక్తి


ఎస్‌ఈ కార్యాలయం

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా ట్రాన్స్‌కో పరిపాలన గతంలో తిరుపతి కేంద్రంగా జరిగేది. పరిపాలన సౌలభ్యత కోసం 5 నెలలు ముందు చిత్తూరు జిల్లాకు ఎస్‌ఈ కార్యాలయం, అధికారులను కేటాయించారు. అందులో కొందరు మాత్రమే ఇక్కడ విధులు నిర్వహిస్తుండగా ఇంక దాదాపు 15 మంది వరకు ఉద్యోగులు రావాల్సి ఉంది. దీంతో ఉన్న ఉద్యోగులపై పనిభారం వేస్తున్నారు. పలు విభాగాలకు కార్యాలయాలను కేటాయింపులు జరపాల్సి ఉంది. జిల్లా ట్రాన్స్‌కో కార్యాలయంలో పలు విభాగాల ఉద్యోగులు చిత్తూరు రావడానికి సముఖత చూపడం లేదు.

విధుల్లో చేరని ఉద్యోగులు


స్థానిక గిరింపేటలో ఎస్‌ఈ కార్యాలయం కేటాయించి 5 నెలలవుతున్నది. ఎస్‌ఈ అక్టోబర్ 13న బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు టెక్నికల్ ఈఈ, ఎస్ఏఓ, పీఓ, ఎంఆర్‌టీ, నిర్మాణ విభాగం, ఏఏఓ ఇతర అధికారులు విధుల్లోకి వచ్చారు. జిల్లాకు ఎస్‌ఈ 1, ఈఈ 3, డీఈ 6, ఏఈ 12, జేఈ 4, ఎస్ఏఓ 1, ఏఏఓ 1, జేఏఓ 5, పీఓ 1, ఎస్ఏ 11, జేఏ 9 మంది చొప్పున మొత్తం 55 మందిని కేటాయించినట్లు సీఎండీ ప్రకటించారు. ఇందులో 25 మంది తిరుపతి ఎస్‌ఈ కార్యాలయం, మిగిలిన ఉద్యోగులు అన్ని డివిజన్ల కార్యాలయం నుంచి సర్దుబాటు చేసుకోవాలని ఆదేశించారు. కానీ ఇంక దాదాపు 15 మంది అధికారులు చిత్తూరు వైపు కన్నెత్తి చూడలేదు. తిరుపతి నుంచి రావడం ఇష్టం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఉద్యోగుల విభజనపై కమిటీ వేసిన ప్రతి నెలా ఈ నెలలో కేటాయింపులు పూర్తి చేస్తామంటూ అధికారులు చెప్పుకోవడంతోనే సరిపోతుంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడినందునే పరిస్థితి నెలకొందనే విమర్శలు ఉంది. దీనికి తోడు డీపీఈ విభాగానికి కార్యాలయం కేటాయించాల్సి ఉంది.

చిత్తూరుపై అనాసక్తి

మొదటి నుంచి తిరుపతిలో పనిచేస్తున్న ఉద్యోగులకు చిత్తూరుకు రావాలంటే ఆసక్తి చూపడం లేదు. పలు విభాగాల హెచ్‌ఓడీలే చిత్తూరుకు వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. కానీ పలు విభాగాల ఏఈలు, కార్యాలయాల సిబ్బంది అయిన జూనియర్, సీనియర్ సహాయకులు 15 మంది వరకు రాలేదు. చిత్తూరుకు రావడానికి ఏదో సాకులు చెబుతూ 5 నెలలుగా కాలం వెళ్లదీశారు. మొదట చిత్తూరు రూరల్, ఎస్‌ఈ కార్యాలయం రెండు ఒకేచోట ఉండడంతో విధులు నిర్వహించడానికి స్థలం లేదన్నారు. తర్వాత తుపాను సమయమని రిలీవ్ చేయడం లేదన్నారు. చివరిగా రూరల్ కార్యాలయాన్ని పాతకలెక్టరేట్‌లో ఏర్పాటు చేయగా ఉద్యోగులు అక్కడికి మారారు. అయిన ఇంకా తిరుపతి నుంచి ఉద్యోగులు రావడానికి తీరిక లేకుండా పోయింది. ఇప్పుడు పిల్లలు పరీక్షల సమయం అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. తర్వాత వారి చదువుల కోసం కళాశాలలు మారడం కష్టమంటారో ఏమీ తెలియడం లేదని స్థానిక ఉద్యోగులు అంటున్నారు. పూర్తి స్థాయిలో ఉద్యోగులు అందుబాటులోకి రాకపోవడంతో విద్యుత్ సేవలు, పలు అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. శాఖాపరమైన వ్యవహారాలు తదితర అంశాల్లో పురోగతి నిలిచిపోయింది. జిల్లా సమాచారం ఎస్‌ఈ కార్యాలయంలో అందుబాటులో లేదు. ఎప్పుడు అడగని ఇంక పూర్తి స్థాయిలో విభజన జరగలేదు, ఆన్‌లైన్ కావాలంటూ సాకులు చెబుతున్నారు. ఈ నెలలోగా ఉద్యోగుల విభజన పూర్తి చేస్తామని ఎస్‌ఈ ఇస్మాయిల్‌అహ్మద్ వివరించారు.

సీఆర్సీ.. అయ్యోర్లపై కసి

- అధికారుల అత్యుత్సాహంతో టీచర్లు ఉక్కిరి..బిక్కిరి
- పరీక్షల సమయంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు
- కూటమి టీడీపీపై పెదవి విరుస్తున్న సర్కారు అయ్యోర్లు



చిత్తూరు కలెక్టరేట్ : కూటమి సర్కారు వ్యవహరిస్తున్న తీరుపై జిల్లాలోని సర్కారు పాఠశాలల ఉపాధ్యాయులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వ వైఖరిపై పెదవి విరుస్తున్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న సమయంలో ఆఘమేఘాలపై ఈ నెల 12వ తేదీన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించడం విమర్శలకు తావిస్తోంది. ఈ సమావేశాల సమయంలో దూరాభారం వెళ్లి సమావేశాలకు హాజరుకావాల్సి వస్తుందని, పరీక్షల సమయంలో ఈ సమావేశాలతో ఉపయోగమేముంటుందని అయ్యోర్లు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారుల అత్యుత్సాహంతో జిల్లాలోని హైస్కూళ్లలోని హెచ్‌ఎంలు, టీచర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రీస్ట్రక్చరింగ్ పేరుతో ఫౌండేషన్ స్కూల్స్ ఏర్పాటుపై స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలను క్లస్టర్ సమావేశాల్లో ఒప్పించాలని విద్యాశాఖ అధికారులు ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఈ ఫౌండేషన్ స్కూళ్ల వ్యవహారంపై ఇప్పటికే తల్లిదండ్రులు విమర్శలు గుప్పిస్తున్నారు.

148 క్లస్టర్లలో సమావేశాలు

జిల్లా వ్యాప్తంగా 32 మండలాల్లో 148 క్లస్టర్లలో ఈ నెల 12వ తేదీన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. ఇప్పటికే జిల్లాలోని 15 పరీక్ష కేంద్రాల్లో ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలకు పలువురు టీచర్లు ఇన్విజిలేషన్ డ్యూటీ సైతం చేస్తున్నారు. ఈ పరీక్ష కేంద్రాల్లో పరీక్ష యథావిధిగా నిర్వహించి, మధ్యాహ్నం క్లస్టర్ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఇన్విజిలేటర్లు సైతం విధులు నిర్వహించిన అనంతరం హాజరుకావాలని చెప్పారు. పరీక్ష కేంద్రాలున్న పాఠశాలల్లో విద్యార్థులకు ఈ నెల 12 వ తేదీ సెలవు ప్రకటించాలని డీఈఓ వరలక్ష్మి ఆదేశించారు.

మొదటి సమావేశంలోనే చుక్కలు

ఫిబ్రవరి 15వ తేదీన నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో కూటమి ప్రభుత్వం టీచర్లకు చుక్కలు చూపించింది. నిమిషం ఆలస్యమైనా అటెండెన్స్ యాప్‌ను క్లోజ్ చేసేశారు. అలాగే సాయంత్రం సమావేశం పూర్తయ్యేవరకు అటెండెన్స్ యాప్ పనిచేయకుండా ఇబ్బందులు పెట్టారు. బయోమెట్రిక్ వేయని టీచర్లకు నోటీసులు జారీ చేశారు. అలాగే ఈ నెల 12వ తేదీన నిర్వహించే సమావేశంలో టీచర్లను ఇబ్బందులు పెట్టేందుకు విద్యాశాఖ అధికారులు సిద్ధమయ్యారు. కూటమి టీడీపీ ప్రభుత్వ తీరుపై అయ్యోర్లు దుమ్మెత్తిపోస్తున్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు రద్దు చేయాలి

చిత్తూరు కలెక్టరేట్ : స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను రద్దు చేయాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ కోశాధికారి రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యాశాఖ అధికారులు చేపట్టనున్న క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఒక ప్రహసనంగా ఉన్నాయన్నారు. ఆ సమావేశాలను వెంటనే రద్దు చేయాలని ఆదేశించారు. ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలు ఉన్న పాఠశాలల్లో సమావేశాలు మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభించడం కుదరదన్నారు. అధికారుల అసంబద్ధ నిర్ణయాలతో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల ఆశయాలు సఫలీకృతం కావడం లేదన్నారు. రంజాన్ నెలలో ముస్లిం టీచర్లు ఉపవాసాలు ఉంటారని వారికి మినహాయింపులు ఇవ్వడం లేదన్నారు. 100 శాతం హాజరు కావాలని అధికారులు ఆదేశాలివ్వడం దారుణమన్నారు. మరోవైపు కొందరు ఇన్విజిలేషన్ డ్యూటీలో ఉన్నట్లు తెలిపారు.

లైంగికదాడి కేసులో నలుగురి అరెస్టు

కార్వేటినగరం: మైనర్ బాలికపై లైంగికదాడి చేసిన కేసులో నలుగురు నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. కార్వేటినగరం మండలం కత్తేరపల్లి గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికపై రెండు నెలల క్రితం కొందరు యువకులు లైంగికదాడికి పాల్పడ్డారు. బాధిత బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కార్వేటినగరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు గోపిశెట్టిపల్లెకు చెందిన పి.దినేష్, నాగరాజు, టి.దినేష్, పవన్, జయరాంను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రేపటి నుంచి ఏపీ ఐసెట్‌కు దరఖాస్తులు

తిరుపతి సిటీ: ఏపీ ఐసెట్ నోటిఫికేషన్ విడుదలైంది. 2025–26వ విద్యాసంవత్సరానికి సంబంధించి ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే ఏపీ ఐసెట్ పరీక్షకు గురువారం నుంచి ఏప్రిల్ 9వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మే 7వ తేదీన పరీక్ష నిర్వహించనున్నారు.

షెడ్యూల్ పత్రాలు లాక్కెళ్లారు!

- కూటమి నేతల దాష్టీకం
- పోలీసులు, ఈఓకు బాధితుడి ఫిర్యాదు
- సద్దుమనిపించిన వివాదం

చౌడేపల్లె: బోయకొండ అటవీ ప్రాంతంలో ఓ టెండర్‌దారుడి నుంచి షెడ్యూల్ పత్రాలను కూటమి నేతలు బలవంతంగా లాక్కెళ్లిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. బోయకొండ గంగమ్మదేవస్థానానికి అవసరమైన సామగ్రి సరఫరా చేసేందుకు ఏడాది పాటు గడువునిస్తూ ఈ నెల 12వ తేదీ 9 అంశాలపై సీల్డ్ టెండర్ల ద్వారా సరఫరా దారుడిని ఎంపిక చేయనున్నారు. ఈ క్రమంలో భాగంగా సరఫరా చేసే టెండర్‌దారుడు ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు నిర్ణయించిన టెండర్ ధరావత్తు సొమ్ము డీడీ రూపంలో ఆలయ కార్యాలయంలో చెల్లించి టెండర్ షెడ్యూల్ పొందాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం వలసపల్లెకు చెందిన సి.చంద్రనాథ్ కుటుంబ సమేతంగా వచ్చి దేవస్థానానికి అవసరమయ్యే తీర్థం ఖాళీ బాటిళ్ల సరఫరా చేసేందుకు టెండర్ వేయడానికి ధరావత్తు చెల్లించి షెడ్యూల్ పత్రాలు పొందాడు. కారులో కొండ పైనుంచి టెండర్ షెడ్యూల్ పత్రాలను తీసుకొని బయలుదేరాడు. కారును కొందరు కూటమి నేతలు బోయకొండ అటవీ ప్రాంతంలో అడ్డుకుని బలవంతంగా షెడ్యూల్ పత్రాలను లాక్కొని వెళ్లిపోయారు. అతను ఈ విషయాన్ని ఆలయం వద్ద ఈఓ ఏకాంబరం, హెడ్‌కానిస్టేబుల్ నాగభూషణం దృష్టికి తీసుకెళ్లారు. జరిగిన ఘటనపై పోలీసులు ఆరా తీసి, షెడ్యూల్ పత్రాలను లాక్కొని వెళ్లిన వారి నుంచి వాటిని తీసుకొచ్చి, తిరిగి బాధితుడు చంద్రనాథ్ కుటుంబ సభ్యులకు అందజేయడంతో వివాదం సద్దుమణిగింది. కాగా బాధితుడు బుధవారం మధ్యాహ్నం 11 గంటలలోపు టెండర్‌దాఖలు చేయాల్సి ఉంది. ఇక ఏమిజరుగుతుందో చూడాల్సి ఉంది.

కళా నీరాజనం!


దహన క్రియలు నిర్వహిస్తున్న కుమారుడు (ఇన్‌సెట్) గరిమెళ్ల భౌతిక దేహం


గరిమెళ్లకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్


తల్లిని ఓదార్చుతున్న కుమారుడు అనిల్‌కుమార్

ప్రముఖ టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌కు మంగళవారం ప్రభుత్వ లాంఛనాలతో గౌరవ అంతిమ సంస్కారాలు నిర్వహించారు. అన్నమయ్య సంకీర్తనలను వైవిధ్యభరిత రాగాలతో స్వరపరిచి తిరుమల శ్రీవారి వైభవాన్ని ప్రపంచ వ్యాప్తం చేసిన గరిమెళ్ల పార్థివ దేహాన్ని అశేష కళాభిమానులు సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. భవానీ నగర్‌లోని ఆయన స్వగృహం వద్ద కుటుంబ సభ్యులు, బంధువుల మధ్య సంప్రదాయబద్ధంగా అంతిమ సంస్కారాలు పూర్తిచేశారు. కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాకలక్ష్మి, టీటీడీ సీపీఆర్‌వో టీ.రవి, ప్రముఖ సినీ గాయని జానకి సోదరి శారద, ప్రముఖ గాయకుడు కార్తికేయ ఘన నివాళులర్పించారు. గరిమెళ్ల అంతిమయాత్ర దేవేంద్ర థియేటర్ వద్దనున్న హరిశ్చంద్ర శ్మశాన వాటిక వరకు సాగింది. కుమారుడైన అనిల్‌కుమార్ తనతండ్రి గరిమెళ్ల దహన సంస్కారాలు పూర్తి చేశారు. – తిరుపతి కల్చరల్

బోయకొండకు రూ.1.12 కోట్ల ఆదాయం


వేలం నిర్వహిస్తున్న ఈఓ ఏకాంబరం

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో వివిధ హక్కుల నిర్వహణకు నిర్వహించిన వేలం పాటల ద్వారా ఆలయానికి రూ.1.12 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఈఓ ఏకాంబరం తెలిపారు. కొండపై క్యాంటీన్, ఐస్ క్రీమ్, కూల్ డ్రింక్స్ విక్రయించుకునే హక్కును రూ.20. 90 లక్షలు హెచ్చుపాటతో మల్లికార్జుననాయుడు కైవసం చేసుకొన్నారు. కొండ కింద క్యాంటీన్, ఐస్‌క్రీమ్, కూల్ డ్రింక్స్ విక్రయించుకునే హక్కును రూ.6.35 లక్షలకు రామకృష్ణ, అలాగే కొండపై ఉన్న నాలుగు దుకాణాల్లో పవిత్రధారాలు, బొమ్మలు, ఫొటోలు, కలకండ, వగైరా విక్రయించుకును హక్కును రూ.69 లక్షలకు మల్లికార్జుననాయుడు దక్కించుకున్నారు. కోళ్ల విక్రయించుకునే హక్కును రూ.6.80 లక్షలకు లవకుమార్, ఆలయం వద్ద ఫొటోలు తీసుకునే హక్కును రూ.1.79 లక్షలకు కిరణ్ సొంతం చేసుకున్నారు. కొబ్బరి పైచిప్పలు సేకరించుకునే హక్కును రూ.7.40 లక్షల హెచ్చుపాటతో రామకృష్ణ దక్కించుకున్నట్లు ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శశిధర్, సూపరింటెండెంట్ రామనాథం తదితరులు పాల్గొన్నారు. కొన్ని వేలం పాటల్లో పాటదారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో కొన్నింటిని వాయిదా వేసినట్లు ఈఓ ఏకాంబరం తెలిపారు. పాదరక్షలు భద్రపరుచుకునే హక్కు, పేపరు కవర్లు, బ్యాగులు విక్రయించుకునే హక్కులను వాయిదా వేసినట్లు ఈఓ ప్రకటించారు. వాయిదా పడిన వేలం పాటలను ఈనెల 20వ తేదీ తిరిగి నిర్వహిస్తామన్నారు.

ప్రభుత్వ స్థలం దురాక్రమణ నిజమే


ఆక్రమిత స్థలంలో సర్వే చేస్తున్న డివిజనల్ సర్వేయర్

చౌడేపల్లె: కాటిపేరి గ్రామంలో ప్రభుత్వ స్థలం ఆక్రమించుకుని పశువుల షెడ్డు ఏర్పాటు చేసిన విషయం నిజమేనని మంగళవారం డివిజినల్ సర్వేయర్ కృష్ణమూర్తి నిర్ధారించారు. ఇటీవల అదే గ్రామానికి చెందిన కుమార్‌రెడ్డి ఆక్రమణపై గ్రీన్‌వెన్స్‌డేలో ఫిర్యాదు చేశారని తెలిపారు. అధికారులు సక్రమంగా విచారణ చేపట్టకుండా ఫిర్యాదును క్లోజ్ చేయడంతో తిరిగి జిల్లా సర్వేయర్‌ను కుమార్‌రెడ్డి ఆశ్రయించగా డివిజినల్ సర్వేయర్ మంగళవారం సర్వే చేశారు. ఈ స్థలం బండిబాటగా రికార్డుల్లో ఉందని గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ విషయమైన ఆర్డీఓకు ఎండార్స్‌మెంట్ చేస్తూ ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

ల్యాప్‌ట్యాప్‌ల చోరీపై కేసు నమోదు

గంగవరం: సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వద్ద నుంచి రెండు ల్యాప్‌ట్యాప్‌ల చోరీకి గురైనట్టు ఫిర్యాదు అందడంతో స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. చిత్తూరుకు చెందిన చాందిని బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నిర్వహిస్తోంది. గత ఆదివారం రోజున బెంగళూరు నుంచి చిత్తూరుకు బస్సులో వెళుతుండగా మండలంలోని లక్ష్మీ భవన్ హోటల్ వద్ద భోజనానికి బస్సు ఆగింది. ఈ క్రమంలో ఆమె వద్ద ఉన్న రెండు ట్యాప్‌ట్యాప్‌లు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గొడవ.. గ్యాంగ్ వార్

- పోలీసులను అడ్డుకున్న కాలనీ వాసులు
- కాలనీలో కార్డన్ సెర్చ్
- పట్టణంలో టెన్షన్
- రౌడీషీటర్లపై పోలీసుల స్పెషల్ ఫోకస్


ఎంఎస్‌ఆర్ కాలనీలో పోలీసుల కార్డన్ సెర్చ్

పలమనేరు: ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగి గొడవ పెద్దది అయ్యి, గ్యాంగ్‌వార్‌కు దారి తీసిన సంఘటన మంగళవారం పలమనేరులో చోటు చేసుకుంది. నిందితులను పట్టుకోవడానికి వెళ్లిన పోలీసు సిబ్బందిని కొందరు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని ఎంఎస్‌ఆర్ కాలనీ విద్యార్థులు, పాతపేట విద్యార్థుల మధ్య కళాశాల వద్ద రెండు రోజుల కిందట చిన్నపాటి గొడవ జరిగింది. దీనిపై ఓ విద్యార్థి తనకు తెలిసిన గ్యాంగ్ ద్వారా మంగళవారం సాయంత్రం ఎంఎస్‌ఆర్ కాలనీ వద్ద బైక్‌లపై కాపుగాచి కాలనీకి చెందిన ఇద్దరు విద్యార్థులను చితకబాదారు. దీంతో తమ పిల్లలపై దాడి చేస్తున్నారంటూ కాలనీ వాసుల ఏకమై వారిపై దాడికి దిగి బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పాతపేటకు చెందిన కొందరు స్టేషన్ వద్దకు వెళ్లి తమపై దాడి చేసి బైక్‌లను లాక్కున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కొందరు కానిస్టేబుళ్లు ఎంఎస్‌ఆర్ కాలనీకి వెళ్లగా తమ పిల్లలపై దాడి చేసినవారు ఇక్కడికి వచ్చేదాకా కుదరదంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పెద్దసంఖ్యలో కాలనీ మహిళలు ఏకమై పోలీసులను అడ్డుకున్నారు. దీంతో పలమనేరు, గంగవరం సీఐలు నరసింహరాజు, మురళీమోహన్, ప్రసాద్ సిబ్బందితో కలసి కాలనీకి చేరుకున్నా ఫలితం లేకుండా పోయింది. మీ పిల్లలపై దాడి చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలి కానీ మీరే చట్టాన్ని చేతుల్లోకి ఎలా తీసుకుంటారంటూ పోలీసులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు ఎంఎస్‌ఆర్ కాలనీ కార్డన్ సెర్చ్‌కు దిగారు. ఈ సందర్భంగా ఓ ఇంట్లో లభించిన గోతాన్ని సీజ్ చేశారు. అందులో ఏముందో తెలియలేదు. ఫలితంగా మదనపల్లి రోడ్డులో రెండు గంటల పాటు టెన్షన్ వాతావరణం నెలకొంది. మొత్తం వ్యవహారంపై వీడియోలు తీసిన పోలీసులు జరిగిన సంఘటనపై విచారిస్తున్నారు. ఈ ఘటనలకు కారణమైన వారిపై చర్యలకు రంగం సిద్ధం చేశారు. దీనికి సంబంధించి విచారణ జరిగాక ఎవరెవరిపై కేసులు నమోదు చేస్తారో పోలీసులు వెల్లడించాల్సి ఉంది. కాగా పట్టణంలో ఎంఎస్‌ఆర్ కాలనీ, పాతపేటకు చెందిన కొందరు యువకుల గ్యాంగ్‌ల కారణంగా పట్టణంలో శాంతిభద్రతల సమస్య నెలకొందనే విషయం ఇప్పటికే జిల్లా ఎస్పీకి పూర్తి సమాచారం వెళ్లిందని తెలిసింది. మొత్తం మీద ప్రశాంతతకు మారుపేరైన పలమనేరులో ఇటీవల ఆశాంతి నెలకొనడంపై పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు.

ఇరువర్గాల పరస్పర దాడులు

గంగవరం: మండలంలోని మదర్‌థెరిసా కళాశాలలో ఒక వర్గం విద్యార్థులపై మరో వర్గం విద్యార్థులు, పలమనేరు పట్టణంలోని ఆర్‌వీఆర్ కాలనీ వాసులతో కలిసి పరస్పరం దాడులకు తెగబడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ సంఘటన మండలంలోని మదర్‌థెరిసా కళాశాల వద్ద మంగళవారం జరిగింది. కళాశాలలో విద్యార్థు ల మధ్య కొంత మనస్పర్ధలు కారణంగా విబేధాలు ఏర్పడి, రెండు వర్గాలుగా విడిపోయారు. ఒక వర్గం విద్యార్థులు తమ బలాన్ని నిరూపించుకునేందుకు పలమనేరు పట్టణంలోని ఆర్‌వీఆర్ కాలనీలోని పోకిరీలను వెంట తీసుకెళ్లి మరో వర్గంపై దాడికి పాల్పడింది. అక్కడి నుంచి సాయిబాబా ఆలయం వద్ద అడ్డగించి అదే వర్గం విద్యార్థులపై మరోసారి దాడి చేశారు. ఆ తరువాత మరో వర్గం విద్యార్థులు పలు కళాశాలల్లో తమ స్నేహితులను పిలిపించి, అందరూ కలిసి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరడంతో ఇరువర్గాల విద్యార్థులకు సర్ది చెప్పడంతో ఘర్షణ సద్దుమణిగింది. ఆ తరువాత అందరూ కలిసి ఏకంగా కాలనీ వరకూ చేరుకుని దాడులకు పాల్పడడంతో అక్కడ కూడా ఘర్షణ వాతావరణం నెలకొంది.